## క్లుప్తంగా

### ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలి



మాట్లాడుతున్న ఏఈ తిరుపతిరెడ్డి

**భీంపూర్:** రైతులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ తిరుపతిరెడ్డి సూచించారు. మండలంలోని నిపాని గ్రామంలో విద్యుత్ ప్రమాదాలపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. వర్షాకాలం నేపథ్యంలో కరెంటు స్తంభాలు, తీగలు కిందికి వంగిన సిబ్బందికి తెలియజేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 1912 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

### మాజీ ఎంపీకి సన్మానం



సోయం బాపూరావును సన్మానిస్తున్న గజేందర్

**నేరడిగొండ:** రాజ్‌గోండ్ సేవా సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆదివారం ప్రమాణస్వీకారం చేసిన మాజీ ఎంపీ సోయం బాపూరావును కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సన్మానించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో కలిసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### పేదల ఆకలి తీర్చడమే ధ్యేయం



అన్నం వడ్డిస్తున్న సంఘం సభ్యులు

**ఆదిలాబాద్‌టౌన్:** పేదల ఆకలి తీర్చడమే ధ్యేయంగా అన్నదాన కార్యక్రమాలను చేపడుతున్నామని సంగెం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు సంగెం సుధీర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అన్నం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆకలితో ఉన్న పేదలకు అన్నదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో చిలుకూరి మహేందర్ రెడ్డి, సలీమ్, శుభాష్, రాజయ్య, అంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

### 227వ వారానికి అన్నదానం

**కై లాస్‌నగర్:** వివిధ పనుల నిమిత్తం ఆదిలాబాద్ పట్టణానికి వచ్చే పేద ప్రజల ఆకలి తీర్చాలనే ఉద్దేశ్యంతో పట్టణానికి చెందిన సంగెం ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమం నిరంతరం సాగుతోంది. ఆదివారం నాటికి 227వ వారానికి చేరింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆ ట్రస్ట్ సభ్యులు పేద ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సంగెం సుధీర్‌కుమార్, సభ్యులు చిల్కూరి మహేందర్ రెడ్డి, సలీమ్, సుభాష్, రాజయ్య, అంబయ్య పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

**బోథ్:** మండల కేంద్రంలో వినాయక్‌రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను ఆదివారం అందజేశారు. వినాయక్‌రావ్ మనవరాలు శివాని సహకారంతో గత 22 సంవత్సరాలుగా ఉపకార వేతనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఆరుగురు విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శ్యాంమోహన్ రావు, ట్రస్ట్ వైస్ చైర్మన్ వామన్ రావు దేశ్‌పాండే, అంబదాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

**ఖానాపూర్:** మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధి చింతలపేట్ గ్రామంలో మహిళా సమాఖ్య భవనం నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివారం ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. చింతల్‌పేట్ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డు నర్సయ్య, కొండ భూమశంకర్, ఎనగంటి హరిప్రసాద్, పిల్లి శివకృష్ణ, తదితరులు ఉన్నారు.

# విచ్చలవిడిగా గడ్డిమందు

- గతంలో కంటే పెరిగిన వాడకం
- భూమిసారం కోల్పోయే అవకాశం



గడ్డి మందు పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

**ఇచ్చోడ:** గత రెండేళ్లుగా గడ్డి మందు వినియోగం భారీగా పెరిగింది. నియోజకవర్గంలో ప్రధానంగా పండిస్తున్న పంటలలో కలుపు తీసేందుకు అత్యధికంగా రైతులు గడ్డి మందునే వినియోగిస్తున్నారు. కలుపు తక్కువ ఖర్చు కావడంతో గడ్డి మందుల వినియోగం పెరుగుతూ.. వస్తుంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఈఏడాది వానాకాలం సాగులో అత్యధికంగా పత్తి, సోయా, మొక్కజొన్న పంటలు సాగవుతున్నాయి. ఒక వైపు కూలీల కొరత, మరో వైపు కలుపు తీసేందుకు ఖర్చులు తగ్గించుకోవడానికి రైతులు గడ్డి మందు విరివిరిగా వినియోగిస్తున్నారు.

**అన్ని పంటలకు..**

గతంలో సోయా పంటలో కలుపు తీసేందుకు మాత్రమే గడ్డి మందు వాడేవారు. పత్తి పంటల్లో గడ్డి మందు వాడే వారు కాదు. గడ్డి మందు పిచికారీ చేయడంతో పత్తి పంట ఎదుగుదల లోపిస్తుంది. పత్తి పంటల్లో కూలీలతోనే కలుపు ద్వారా గడ్డిని తీయించేవారు. కానీ గత రెండేళ్ల నుంచి పత్తి పంటలో సైతం కూలీలతో కాకుండా గడ్డి మందు ద్వారా కలుపు తొలగిస్తున్నారు.

**భవిష్యత్‌లో గడ్డు కాలమే..**

గడ్డి మందు అతిగా వాడకంతో రానున్న రోజుల్లో భూములు సారవంతం కోల్పోయే అవకాశం ఉంది. సారవంతమైన నల్లరేగడి భూముల్లో విష పూరితంగా మారి పర్యావరణానికి ముప్పుగా మారనున్నాయి. జీవవైవిద్యం దెబ్బతింటుదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. గడ్డి ముందు ఎక్కువగా పిచికారీ చేసే వారు సైతం క్యాన్సర్ భారిన పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

### ఖర్చు తక్కువ



గడ్డి ముందు వినియోగంతో ఖర్చు చాలా తక్కువ. దీంతో గత రెండేళ్ల నుంచి గడ్డి మందునే ఎక్కువగా వాడుతున్నాం. గడ్డి మందు పిచికారీ చేసిన రెండు రోజుల్లోనే గడ్డి జాతులు చచ్చిపోతాయి. దీంతో సమయం వృథా కాదు.

– రుపేశ్‌రెడ్డి, రైతు, అడేగామ (కె)

### కూలీల కొరతే కారణం



అవసరం ఉన్నప్పుడు కూలీలు దొరకపోవడంతో గడ్డి మందు పిచికారీ చేయాల్సి వస్తోంది. కూలీలు కొరతే కాకుండా కూలీ ఖర్చులు పెరగడంతో గడ్డి మందు వినియోగిస్తున్నాం. దీంతో గడ్డి మందులు వాడుతున్నాం. కూలీల కన్న గడ్డి మందుతోనే ఖర్చులు తక్కువ అవుతున్నాయి.

– మానే బాలాజీ, రైతు, దాబా(కె)

### మోతాదు మించి వాడొద్దు



గడ్డి మందులు మోతాదు మించి వాడొద్దు. తక్కువ మోతాదుతో వాడుకుంటే భవిష్యత్‌లో నష్టం ఉండదు. కూలీల కొరతను అధిగమించేందుకు రైతులు ఎక్కువగా గడ్డి మందునే పిచికారీ చేస్తున్నారు. గడ్డి మందు అతిగా వాడకం ద్వారా భూమి సాంద్రత కోల్పోయే ప్రమాదం ఉంది.

– భగత్ రమేశ్, ఏవో ఇచ్చోడ

# ఆదాయం ఉన్నా.. అభివృద్ధి శూన్యం



పిచ్చిమొక్కలతో నిండిన చెరువు

**జైనథ్:** దేవాదాయ శాఖకు ఆదాయం మీద ఉన్నా.. శ్రద్ధ అభివృద్ధి మీద లేదు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోనే అత్యంత ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రాల్లో శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఒకటి. ప్రతిరోజు వందల మంది భక్తులు దర్శించుకునేందుకు వస్తుంటారు. ఆలయం ఎదుట చెరువు ఏళ్ల నుంచి పిచ్చిమొక్కలతో చెత్త చెదారంతో నిండి అధ్వానంగా మారింది. ఈ చెరువు దాదాపు 22 ఎకరాల్లో విస్తరించి ఉంది. చెరువు పూడికతీతతో పాటు పిచ్చిమొక్కలు తొలగిస్తే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దవచ్చు. మినీ ట్యాంక్‌బండ్ ఏర్పాటు చేయవచ్చు. ఈ విషయం పలుమార్లు నాయకులకు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెరువును సుందరీకరణగా తీర్చిదిద్దాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### టైర్లతో ఆకట్టుకునే ప్రతిమ



పాత టైర్లతో తయారు చేసిన డిజైన్

**కై లాస్‌నగర్:** ఆదిలాబాద్ పట్టణంలో ఆనవాళ్లు కోల్పోయిన ప్రధాన చౌక్‌లను సుందరీకరించే దిశగా బల్దియా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే స్థానిక కుమురం భీం చౌక్‌లో పనికి రాని టైర్లతో ఆకట్టుకునే ప్రతిమను ఏర్పాటు చేశారు. వండర్ ఇన్నోవేషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ప్రతిమ చిన్నారులను ఆకట్టుకుట్టుంది. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బైరీ శంకర్, పర్యావరణ ఇంజనీర్ అవి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

**ఖానాపూర్:** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పట్టణంలో ఆవుకు వినతిపత్రం ఇచ్చి వినూత్న నిరసన తెలిపారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం.. ప్రతీ నెల ఐదో తేదీ లోపు అదించాలని వేడుకుంటున్నారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మి, మంజుల, విజయ, రాజేశ్వరి, లింగవ్వ, మంగ, పద్మ తదితరులు ఉన్నారు.

# పెరిగిన సాగు విస్తీర్ణం



రాళ్ల భూమిలో సాగు చేస్తున్న పత్తి

- పెట్టుబడి సాయం అందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- రాళ్ల భూములు సైతం సాగులోకి..

**తాంసి:** గత కొన్ని ఏళ్ల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. పంటలు సాగు చేసేందుకు పథకాలు, పెట్టుబడి సాయం అందిస్తున్నాయి. గత దశాబ్దాలుగా బీడు భూములుగా ఉన్న నేలలు సైతం సాగులోకి వస్తున్నాయి. సాగుకు అనుకూలంగా లేవని భావించి వదిలేసిన భూముల్లో సైతం పంటలు పండిస్తున్నారు. దీంతో ప్రతీ ఏటా ఆయా గ్రామాల్లో సాగుభూమి విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. బీడుగా ఉన్న భూములను చదును చేసి పంటలు పండిస్తున్నారు. రాళ్ల భూముల్లో సైతం రతనాల పంటలను పండిస్తూ ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు.

**సాగుకు పెట్టుబడి సాయం..**

రైతులు పంటల సాగుకు ఇబ్బంది లేకుండా పెట్టుబడి సాయం కోసం గత కొన్ని సంవత్సరాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కొన్ని సంవత్సరాలుగా ప్రతీ ఏటా మూడు విడుతలుగా రూ.2వేల చొప్పున రూ.6వేల పెట్టుబడి సాయం అందిస్తుంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎకరానికి రూ.10 వేల చొప్పున అందించగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ ఏటా ఎకరానికి రూ.12వేల చొప్పున రెండు విడతలుగా పెట్టుబడుల కోసం రైతులకు పెట్టుబడి సాయం అందజేస్తుంది. దీంతో రాళ్ల భూములు, చెట్లు ఏపుగా పెరిగిన భూములు, ఎత్తుగా ఉన్న భూములు క్రమంగా వినియోగంలోకి వస్తున్నాయి.

**పడావు భూములకు పెరిగిన డిమాండ్..**

గతంలో వ్యవసాయ భూములకు డిమాండ్ అంతంతగానే ఉండేది. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పెట్టుబడి అందిస్తుండటంతో భూములకు సైతం అధిక డిమాండ్ పెరిగింది. రాళ్ల భూములు, ఎత్తుపళ్లాలు ఉన్న భూములు సాగుకు పనికిరావానే కారణంతో రైతులు అలాంటి భూముల్లో పంటలను సాగు చేసేవారు కాదు. పంటలు వేయకపోవడంతో రాళ్ల భూములు బీడు భూములుగా మారి పశువులకు పశుగ్రాసం కోసం మాత్రమే పనికి వచ్చేవి. బీడు భూములు సైతం రైతులు సాగులోకి తీసుకొచ్చి వివిధ పంటలను సాగు చేస్తున్నారు.

### చినుకు పడితే చిత్తడే



గాదిగూడ మండలంలోని దాబా (బి ) గ్రామ పంచాయతీ పరిధిలోని పొనూర్ లొద్దిగూడ వెళ్లే రోడ్డు చిన్నపాటి వర్షం కురిసినా.. చిత్తడిగా మారుతుంది. దాబా నుంచి పొనూర్ లొద్దిగూడ రోడ్డుపై కనీసం బైక్ కూడా నడపలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి బీటీరోడ్లు నిర్మించాలని ప్రజలు కోరతున్నారు.

– నార్నూర్

### ద్విచక్ర వాహనమే జీవనాధారం



ద్విచక్ర వాహనంలో బెలూన్ వ్యాపారం

**ఉట్నూర్‌రూరల్:** రాజస్థాన్‌కు చెందిన సంచార జీవులు ఉపాధిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన సంచార జీవులు ద్విచక్ర వాహానానికి ట్రాలి ఏర్పాటు చేసి బెలూన్ వ్యాపారం చేస్తున్నారు. వర్షంలో తడవకుండా తాడిపత్రి అమర్చుకొని వాహనంలో వ్యాపారమే కాదు వంటలు వండుకుంటూ అందులోనే తింటూ, అందులోనే నిద్రిస్తున్నారు.

# ఆలయాల అభివృద్ధికి కృషి



పూజలు చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ:** ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని నారాయణపూర్ గ్రామంలో గల ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధిలో భాగంగా హనుమాన్ మందిర ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆలయాల అభివృద్ధికి ఎల్లవేళలా సహాయ సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గులాబ్‌సింగ్ మహరాజ్ సన్నిధానాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే**

**నేరడిగొండ:** చందాపూర్(బొడిడి) గ్రామంలోని గురు సాహెబ్ భక్తులు శ్రీగులాబ్ సింగ్ మహరాజ్ సన్నిధానాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. ఇటీవలే స్వర్గీయులు కాగా ఆదివారం ఆయన సన్నిదానాన్ని దర్శించుకొని నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట సాబ్లే నానక్ సింగ్, ప్రతాప్ సింగ్, గణేష్, గోతి మెర్చన్, భారత్, పచ్చుసింగ్, హుషార్ సింగ్, గోతి గులాబ్ సింగ్, సాబ్లే రాజేందర్, మెర్సింగ్, రాథోడ్ సజన్, ప్రీతం రెడ్డి ఉన్నారు.

**హామీలకు కట్టుబడి ఉంటా**

**గుడిహత్నూర్:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కొల్హారీ గ్రామంలో ఎమ్మెల్యే నిధులతో రూ.5 లక్షలతో మంజూరు చేసిన బుద్ధవిహార్ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. తాను ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతీ హామీ పూర్తి చేసుకోవడానికి ఎన్ని అవరోధాలు వచ్చిన నెరవేర్చడానికి కృషి చేస్తానన్నారు. అంతకు ముందు స్థానిక అంబేడ్కర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్, గజానంద్ గిత్తే, ప్రకాష్, దోమకొండ సుధాకర్ ఉన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

**భీంపూర్:** గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని మండలంలోని గొల్లఘాట్, గుంజల గ్రామస్తులు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే అ నిల్ జాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. గొల్లఘాట్ వెళ్లే రోడ్డు మార్గాలు పూర్తిగా అధ్వానంగా మా రాయని, వెంటనే రోడ్డు పనులు ప్రారంభించా లని కోరారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.

**నేరడిగొండ:** గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కుమారి గ్రామస్తులు అన్నారు. ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే త్వరలో గ్రామంలోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

# భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



సమావేశమైన మెస్రం వంశీయులు

**ఇంద్రవెల్లి:** కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ఈనెల 29న నిర్వహించే నాగుల పంచమి పూజలు చేసేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని మెస్రం వంశం పెద్దలు మెస్రం కోసేరావ్, మెస్రం సోనేరావ్, శేఖరబాబు, దేవ్‌రావ్‌లు అన్నారు. ఆదివారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో సమావేశమై నాగులు పంచమి రోజు నిర్వహించే మినీ జాతర ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలపై చర్చించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి నాగోబా ఆశీస్సులు పొందాలన్నారు. మెస్రం వంశీయులు మెస్రం శేక్‌నాథ్, మెస్రం మానిక్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

# మన్ కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు



వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

**ఇంద్రవెల్లి:** మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ 124వ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నాయకులు వీక్షించారు. ప్రత్యేకంగా పార్టీ కార్యాలయంలో టీవీ ఏర్పాటు చేసి దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో చెప్పిన సందేశాలను అలకించారు. బీజేపీ ఖానాపూర్ అసెంబ్లీ కోకన్వీనర్ ఆరెల్లి రాజలింగు మాట్లాడుతూ.. మన్‌కీ బాత్ కార్యక్రమం ద్వారా ఇతర ప్రాంతంలో జరిగే విశేషాలు, మానవ అభివృద్ధి, ఆలోచనలు ప్రతిఒక్కరికీ చేరుతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోవ రాజేశ్వర్, దీపక్‌సింగ్ షేకవత్, దేవ్‌పూజే మారుతి, ఆడావ్ చంపత్‌రావ్, రాథోడ్ భీంరావ్, మోరే దిలిప్, మస్కే రాజువర్ధన్, హెరేకుమ్ర అనిల్, కనక హన్మంత్‌రావు పాల్గొన్నారు.

# భూ వివాదంలో చీటింగ్ కేసు

**సాత్నాల:** భూ వివాదంలో బోయర్ రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌతమ్ పవర్ తెలిపాడు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. భోరజ్ మండలం కేదర్పూర్ గ్రామానికి చెందిన గోస్కుల నర్సింగు, బోయర్ రమేశ్ వద్ద 2011లో రూ. 3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 20 శాతం వడ్డీకి, నర్సింగ్ పేరు మీద ఉన్న 1 ఎకరం 36 గుంటల భూమిని బోయ రమేశ్‌కు రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చాడు. 2013లో రూ. 2 లక్షలు, 2017 రూ. 2 లక్షలు తిరిగి ఇచ్చేశాడు. అనంతరం తన భూమి తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాలని అడగగా, నువ్వు తీసుకున్న అప్పు ఇంకా మిగిలి ఉందని, ఇంకా నాకు డబ్బులు రావాలని అడిగాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు లెక్కలు చెప్పకుండా తిప్పించుకుంటున్నాడు. దీంతో బాధితుడు బోయర్ రమేశ్‌పై ఫిర్యాదు చేయడంతో ఆయనపై 97/ 25 చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గౌతమ్ పవర్ తెలిపారు.


### అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు



సాత్నాల మండలంలోని మెడిగూడ (ఆర్) గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పూడిక తీయకపోవడంతో పూర్తిగా మట్టితో నిండిపోయి, మురుగు నిలిచి పోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడద ఎక్కువై పోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పేరుకుపోయిన పూడికను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– భీంపూర్

### రాంటెక్ ఆలయాన్ని దర్శించిన జోగు రామన్న



ఆలయాన్ని దర్శించుకుంటున్న జోగు రామన్న

**ఆదిలాబాద్‌టౌన్:** మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో గల 12వ శతాబ్దానికి చెందిన అతి పురాతన రాంటెక్ ఆలయాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆదివారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనాలను పొందారు. అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు భోజనం వడ్డించారు. అతి పురాతన ఆలయాన్ని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆయన వెంట కారింగుల ప్రణయ్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.